**చిన్న వయసులోవున్న నిర్మలత్వం, ఉత్సాహం పెరిగేకొద్దీ తరిగిపోయి, మూర్ఖత్వం, అమానుషత్వం మూర్తీభవించేట్లు పిల్లలు రూపొందటానికి కారణ మేమిటి?**

"ఇక్కడ నించున్నావా ఇంతసేపూ? అమ్మ ధనియాలు తెమ్మని పంపుతే ఇదా నువ్వు చేస్తోన్న నిర్వాకం? ఆ పాములాళ్ళ వెనకే వెళ్ళకపోయావూ?"

"పాములాళ్ళెప్పుడో వెళ్ళిపోయారే.... కమలావాళ్ళు ఆడుకుంటున్నారనీ..."

"ఓహో! ఆ పాములాటలు కాకపోతే ఈ దొమ్మరాటలూ. ఇంటికి పద, నీకు మూడిందిలే. అమ్మ తెగ తిట్టిపోస్తోంది"

"నిజంగానా అక్కా? అమ్మ కోపంగా వుందేవిటే?"

"వుండదూ? సరుకు తెమ్మని కొట్టుకి పంపుతే ఇంటికి తిరిగి రావాలన్న జ్ఞానమేమన్నా వుందా నీకు?"

"ధనియాలెప్పుడో తెచ్చేశానే.... అక్కా! అమ్మకి నువ్విచ్చెయ్యవే!"

"నాకెందుకు తద్దినం - నువ్వే ఇచ్చుకో!"

"నన్ను కొడుతుందేమోనే.... అక్కా! కొంచెం ఇవ్వవే."

"కొడితే ఏడుస్తూ కూచో. ఏం. చెప్పిన పని చెయ్యకపోతే కొట్టక ముద్దెట్టుకుంటుందా?"

"తెచ్చేశాను కదే అక్కా."

"నేను రాకపోతే ఎప్పటికొచ్చేదానివి?"

"వొచ్చేస్తున్నానే, కమల ఏదో అడుగుతుంటేనూ."

"నాకేం తెలీదు, నువ్వెళ్ళి ఇచ్చుకో. ఏమడిగిందేవిటి, కమల?"

"ఆడుకుందాం. వొస్తావా అంది."

"వారం రోజుల్లో పరీక్షలు పెట్టుకుని ఆటలాడతావన్న మాట, ఆటలు."

"అన్నీ వొచ్చేసునే నాకు. పజ్యాలూ. ఎక్కాలూ...."

"అబ్బో! పెద్ద పండితురాలివై పోయావు మరి. ఇక పుస్తకం ముట్టక్కర్లేదు."

"రాత్రుళ్ళు చదువుకుంటాగా? కమలా వాళ్ళు ఆడుకోడం లేదూ?"

"వాళ్ళెప్పుడన్నా పుస్తకం ముట్టుకోడం చూశావా? ఎప్పుడూ కాకుల్లాగ తిరుగుతారని అమ్మ అనదూ? ఎండలోనూ వాళ్ళే. వానలోనూ వాళ్ళే.... ఛ! ఏం పిల్లలో! నడవ్వేం నువ్వూ?"

"వస్తున్నాగా? అక్కా! వాళ్ళంతా అనక సినిమా కెళ్తారంటే."

"బుద్ధి లేకపోతే సరి. ఎన్ని సినిమాలు చూస్తారు నెలకి? చూస్తే చూస్తారు. వాళ్ళకేం! డబ్బొచ్చి పడుతుంది. అమ్మ అనదూ. వాళ్ళ నాన్న అన్నీ వెధవ పనులే చేసి గడిస్తాడట."

"మన నాన్నకూడా వెధవ పనులు చెయ్యడనా?"

"చాల్లే నోరుముయ్యి. వెధవ పనులూ చెయ్యమంటావు. ఇంకేమన్నానూ చెయ్యమంటావు"



"ఏమ్మా! తప్పా? చక్కగా డబ్బొస్తుందిగా?"

"డబ్బైనా ఏవిటీ? మంచీ మర్యాదా వుండక్కర్లేదూ? వెధవ పనులు చేస్తే అమ్మ వూరుకుంటుందా?"

"వెధవ పనులంటే ఏవిటే అక్కా?"

"నీకేం తెలుస్తుంది? చిన్న పిల్లవి. వూరుకో."

"పోనీలేమ్మా. నా కెందుగ్గానీ కమల గౌను యెంత బాగుందోనే అక్కా! చూశావా నువ్వు?"

"ఆఁ చూడకేం? దానికుచ్చులూ. అదీనూ! వాళ్ళకి తగ్గ గౌన్లే అవి. రౌడీ గౌన్లు."

"అంతా బడాయి. కుచ్చులు పెట్టుకుంటే యేమవుతుందేవిటీ? .... అక్కా! కమలావాళ్ళతో మనంకూడా వెళ్దామే సినిమాకి."

"అమ్మ వీపు బద్దలు కొడుతుంది."

"ఎందుకు కొడుతుందేవిటీ? అందరూ వెళ్తారుగా. అమ్మ వెళ్ళదూ మనల్ని వొదిలేసి?"

"వెళ్తే వెళ్తుంది. పెద్ద వాళ్ళతో నీకు పోవత్యమా?.... అలా వెనక్కి వెనక్కి చూస్తావెవిటే? అసలు యింటికి వస్తావా. రావా? అన్నట్టు మరిచేపోయాను. అమ్మ నీకూ, నాకూ గాజులుకొంది. నీకుఎర్రవీ, నాకు ఆకుపచ్చవీ.... ఎంత బాగున్నాయో"

"ఛీ, నాకేం అక్కర్లేదు వెధవ గాజులు ఆ డబ్బుల్తో సినిమాకెళ్తే...."

"సినిమా,సినిమా అని పట్టించావేమిటే? పిచ్చి మొద్దూ! కడుపునిండుతుందా, కాలు నిండుతుందా? ఆడపిల్లల చేతులు గాజుల్లేకపోతే ఏడిసినట్టుంటాయని అమ్మ విసుక్కోదూ?".

"చేతులెక్కడన్నా ఏడిసినట్టుంటాయా? నా చేతులు చూడు ఎంత బాగున్నాయో. నాకేం గాజులక్కర్లేదు. మళ్ళీ అవి బద్దలైతే పోట్లాడుతుంది. కమలావాళ్ళు గాజులెప్పుడూ వేసుకోరు."

"అస్తమానూ ఆ వెధవల పేస్లెత్తకు. నాకు వళ్ళు మండుతుంది.వెధవ స్నేహాలు చేసి చెడుతున్నావు. సాయంత్రం లక్ష్మి పిన్నిగారింటికి పేరంటాని కెళ్ళాలని అమ్మ గాజులు కొంటే.... వాళ్ళ పాపాయికి చెవులు కుట్టిస్తున్నారు తెలుసా?"

"అమ్మో! అంత చిన్న పాపాయి ఏడవదూ?"

"ఏడిస్తే అదే వూరుకుంటుంది. ఇవ్వాళే మంచిరోజట. మళ్ళీ మంచిరోజు రావొద్దూ?"

"ఏమో! నేనేం పేరంటానికిరాను. నా డబ్బులు నా కిచ్చెయ్యండి. సినిమాకి పోతాను కమలా వాళ్ళతో."

"ఆఁ నీ డబ్బులు, నీ తాత గడించాడు. అమ్మతో చెపుతానుండు. కాళ్ళు విరగ్గొడితే కుదురుతుంది నీ తెగులు."

"ఎందుకు విరగ్గొడుతుందేం? కాస్త పరుగులెత్తితే కాళ్ళువిరగ్గొటుకుంటారట్రా అని అరుసుందిగా? తనెందుకు విరగ్గొడుతుందేం?"

"ఏం చేస్తుంది పెంకి వేషాలేస్తే?"

"అక్కా! అక్కా! కమల నాటకంలో వేషం వేస్తోందటే. మేష్టారు వెయ్యమన్నారట."

"ఛీ! ఛీ! పాడు వేషాలు. ఏం చేసినా వాళ్ళకే తగును."

"ఏమ్మా. తప్పా? సరదాగా నాటకంలో వేస్తే?"

"సరదా ఏమిటి? సిగ్గుండక్కరా? అందరి ముందూ ఎలా గంతు లేస్తారు బాబూ?"

"గంతులెయ్యక్కర్లేదే. కృష్ణుడూ, రాధా పాటపాడుతూ నాటకం వేసారట. అంతే. నన్ను రాధ వేషం వెయ్యమందే కమల."

"అదా సంగతీ? మరి చెప్పవేం? వాళ్ళతో బైల్దేరు. నిన్ను సినిమాల్లోకూడా చేరుస్తారు."

"అమ్మో! సినిమాల్లోనే. ఎంత బాగుంటుందోనే"

"చాల్లే నోరుముయ్యి. పేట్రేగిపోతున్నావు"

"సీత పిన్ని అందరిముందూ వీణ వాయిస్తే ఎంతో బాగుందని మెచ్చుకున్నారుగా? సినిమాల్లోకి పనికొస్తుందన్నారూ."

"అది వేరు. వీణ అంటే సరస్వతో సమానం. చక్కగా తివాసీమీద కూచుని వీణ వాయిస్తుంది సినిమాలోలాగంతులేస్తుందనుకున్నావా?.... పదవే తల్లీ తొందరగా అమ్మ ఏం కేకలేస్తోందో."

"ధనియాల్లేకపోతే ఏం మునుకుపోతుందేం? కూర వండేసుకోకూడదూ?"

"ఎవరు నేర్పుతున్నారు నీ కివన్నీ? దేనికేది పడాలో అది పడకపోతే హోటల్లో వంటల్లాగ ఏడుస్తాయని అమ్మ అనదూ?"

"అక్కా! హోటల్లో యెంత బాగుంటుందే! మనం మామయ్యగారి వూరు వెళ్ళేప్పుడు స్టేషను దగ్గర హోటల్లో తినలేదూ? ఎంత బాగున్నాయో ఇడ్లీలు."

"అయితే నువ్వు వంటా అదీ నేర్చుకోకు. హోటల్లోనే మింగు."

"అబ్బా! అల్లాగైతే ఎంత బాగుంటుందో నాకు. ఎంత బాగా వండినా హోటల్లో తింటారెందుకండీ?" అని అమ్మ పోట్లాడదూ నాన్నతో? నాన్నకీ, నాకూ అంతే."

"నాన్నతింటే తింటాడు. మొగాళ్ళకేవిటీ. యెల్లా చేసినా చెల్లుతుంది. వాళ్ళ డబ్బు వాళ్ళ యిష్టం. నాన్నలాగ నువ్వు చేస్తావా?"

"అక్కా! మొగాళ్ళకి డబ్బు లెవరిస్తారే?"

"ఒకరిచ్చేదేవిటి? వాళ్ళే వుద్యోగాలు చేస్తారు."

"వూఁ చేస్తే?"

"చేస్తే ఏవిటి. నీ తలకాయ. అందుకే వాళ్ళదగ్గర డబ్బుంటుంది. ఎక్కడేది తినాలన్నా తింటారు.

"అయితే నేనూ వుద్యోగం చేస్తాను."

"ఏడిశావులే. అమ్మ వొప్పుకుంటుందనుకున్నావా? నేనూ నీలాగే అనుకున్నాలే చిన్నప్పుడు."

"...................."

"నిలబడ్డావేమిటి? రావేం లోపలికి?"

"అమ్మ కొడుతుందేమోనే అక్కా, నువ్వు తీసుకుపోవే ఇవి- నా కాలికి దెబ్బ తగిలిందని చెప్పెయ్యవే."

"దెబ్బ తగిలిందేం నీ కాలికి? ఎక్కడ నేర్చావు ఈ వేషాలన్నీ? అమ్మదాకా ఎందుకు. నేను లేనూ? నీ రెండూ నీకు పడితేగానీ...."

అక్క చెల్లెలి జడ గట్టిగా పట్టుకుని తలకాయ వంచి వీపుమీద దబదబా చరవడం మొదలుపెట్టింది.

చెల్లెలు అక్కచేతిలో పెనుగులాడుతూ నేలమీద దొర్లుతుంది.

అక్క కొడుతూనే వుంది.

చెల్లెలు ఏడుస్తూనే వుంది.

దెబ్బలు తినే చెల్లెలికి- ఏడేళ్ళు.

దెబ్బలు కొట్టే అక్కకి- పన్నెండేళ్లు.

★


ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address :

Samaj Kalyan (R.L. 78)

(P. O) Katri Sarai (Gaya)